బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, కాలేరు వెంకటేశ్, చింతా ప్రభాకర్

నిండుసభలో రేవంత్ పచ్చి అబద్ధాలు

సీఎంకి మతి భ్రమించింది.. రుణమాఫీ విషయంలోనే క్లారిటీ లేదు.. భరోసా ఎప్పుడిస్తరు? ఎంతమందికిస్తరు?.. అప్పుల విషయంలో తప్పుడు లెక్కలు: హరీశ్

- పంటల బీమాపై చేతులెత్తేసిన ప్రభుత్వం
- కడుపులున్న అక్కసంతా రేవంత్ కక్కిండు
- మీడియా సమావేశంలో హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ప్రజలంతా దేవాలయంగా భావించే నిండు శాసనసభలో సీఎం హోదాలో రేవంత్ పచ్చి అబద్ధాలు పల్లవే శారని, తన మాటల గారడీతో ప్రజలను సభసాక్షిగా పక్కదారి పట్టించారని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శనివారం అసెంబ్లీ ముగిసిన తర్వాత హరీశ్ బీఆర్ఎస్ఎల్పీలో మీడియాతో మాట్లాడారు. సభ చివరి రోజు వరకు రైతు భరోసా ఎప్పుడిస్తారో?, ఎంతిస్తారో?, ఎంతమందికి ఇస్తారో చెప్పలేదని, రుణమాఫీ విషయంలోనూ క్లారిటీ ఇవ్వలేదని వాపోయారు. అప్పుల విషయంలో తప్పుడు లెక్కలు చెప్తున్నారని ప్రభుత్వానికి, సీఎం, మంత్రులకు అప్పులపై ఇప్పటికీ క్లారిటీ లేదనే విషయం తేలిపోయిందని చెప్పారు.

అక్కసంతా వెళ్లగక్కిండు..

బీఆర్ఎస్‌పై తన కడుపులున్న అక్కసునంతా రేవంత్‌రెడ్డి వెళ్లగక్కిండని హరీశ్ చెప్పారు. 'ఒక్క స్కూలు కట్టిండ్రా? అని సీఎం మాట్లాడిండు.. నీకేం తెలుసు..? ఏ నియోజకవర్గానికైనా పోదాం పా.. మేము కట్టిన మన ఊరు మనబడి స్కూళ్లను.. గురుకులాలను చూపిస్తం' అని చెప్పారు. తాము ఫార్మాసిటీలో ఏ కంపెనీకి కూడా ఎకరం కూడా ఇవ్వలేదని, కానీ అగ్గువకే కంపెనీలకు కేటాయించినట్టు సీఎం అబద్ధాలు చెప్తున్నారని తెలిపారు.

గారడీ మాటలను నమ్మరు

'ఆగస్టు15లోగా రుణమాఫీ చేస్తే నేను రాజీనామా చేస్తా అని బల్లగుద్ది చాలెంజ్ చేసిన. ఇప్పటికీ రుణమాఫీ కాని రైతులు లక్షల్లో ఉన్నరు. ప్రభుత్వం మెడలు వంచి రుణమాఫీ అయ్యేలా చేసిన. కానీ నువ్వేం చేసినవ్? మొత్తం ఎగబెట్టే ప్రయత్నం చేసినవ్.. నీ కథంతా ఉల్టా చోర్ కొత్వాల్‌కో డాంటే అన్నట్టున్నది' అని హరీశ్ దెప్పిపొడిచారు. 'ఆరిపోయే దీపానికి వెలుతురెక్కువ అన్నట్టు ముఖ్యమంత్రివన్నీ చావు తెలివితేటలు.. గొంతు చించుకొని నువ్వు చెప్పే గారడీ మాటలను ప్రజలు నమ్మరు' అంటూ మండిపడ్డారు. 'పంట బీమాపై మంత్రి తుమ్మల చేతులెత్తేసిండు. ఎస్ఎల్‌బీసీని మేం 11 కిలోమీటర్లు తవ్వితే, కిలోమీటరు కూడా తవ్వలేదంటరు. మూసీ కా లుష్యం పాపం 50 ఏండ్ల కాంగ్రెస్ పాలన, 16 ఏండ్ల టీడీపీ పాలన ఫలితమే' అని విమర్శించారు.

> మూసీ కంపు కంటే ముఖ్యమంత్రి చెప్పే కంపు ఎక్కువైంది. ఏడాదిగా చేసిందేం లేక అబద్ధాల పాలన సాగిస్తున్నడు. రేవంత్‌రెడ్డి అబద్ధాల నుంచి ఈ రాష్ట్రాన్ని, ప్రజలను ఆ దేవుడే కాపాడాలె.. సభ చివరి రోజు వరకూ రైతు భరోసా ఎప్పుడిస్తరో? ఎంతిస్తరో? ఎంతమందికిస్తరో చెప్పనేలేదు!
>
> -హరీశ్‌రావు

> సభలో ప్రతి సబ్జెక్టులోనూ ముఖ్యమంత్రి నోటికొచ్చినట్టు సొల్లు వాగుడు వాగిండ్రు. మేము చెప్పని మాటలను చెప్పి తన స్థాయిని తగ్గించుకున్నడు. మేమే రుణమాఫీ, ఫీజు రియింబర్స్‌మెంట్, ఆర్ఆర్ఆర్, ప్రాజెక్టులు వద్దన్నమని, అడ్డంపడ్డమని సిగ్గులేకుండా అబద్ధాలు చెప్పిండు. అసెంబ్లీ సాక్షిగా ఇన్ని పచ్చి అబద్ధాలాడిన ముఖ్యమంత్రిని మేం ఇంతవరకూ చూడలే..
>
> -హరీశ్‌రావు

చర్చకు వచ్చే దమ్ముందా రేవంత్?

'నాలుగైదు వేల కోట్లు ఖర్చుపెట్టి మూసీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు కట్టినం. లగచర్లకు పోదాం పద.. మూసీ ప్రారంభమైన దగ్గరికి వెళ్దాం పద. రేవంత్‌రెడ్డీ.. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిపై చర్చకు వచ్చే దమ్ముందా?' అంటూ హరీశ్ సవాల్ చేశారు. 'మేము వాస్తవాలు చెప్తమనే మాకు స్పీకర్ మైకు కూడా ఇవ్వడం లేదు.. అప్పుల గురించి సీఎం తప్పులు మాట్లాడారు' అని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు 4.17 లక్షల కోట్లేనని, పాత కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి వారసత్వంగా ఇచ్చిన అప్పులకు 3.5 లక్షల కోట్లకు పైగా మిత్తీలు కట్టామని వివరించారు. 'మేము ఎన్నో అభివృద్ధి పనులు చేసినం.. మీకు పాలన చేతగాక ప్రజల ముందుకు పోలేక అప్పులపై తప్పుడు ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకొంటున్నరు' అని మండిపడ్డారు.

కాంగ్రెస్ రిపోర్టులోనే కాళేశ్వరం గొప్పదనం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన రిపోర్టులోనే కాళేశ్వరం గొప్పతనం ఉన్నదని, అయినా కావాలనే పనిగట్టుకొని అబద్ధాలు చెప్తున్నారని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కాళేశ్వరం ద్వారా 20 లక్షల 30 వేల ఎకరాలకు పైగా సాగులోకి వచ్చిందని కాంగ్రెస్ రిపోర్టు చెప్తుంటే.. సాక్షాత్తూ సీఎం సభలో కాళేశ్వరంతో 50 వేల ఎకరాలే సాగవుతున్నయని అంటుండు. ఉత్తర తెలంగాణకు సాగు, తాగునీరు ఇస్తున్నది కాళేశ్వరం కాదా? పరిశ్రమలకు నీళ్లిస్తున్నది కూడా కాళేశ్వరమే.. కాళేశ్వరమే లేకుంటే మల్లన్నసాగర్ లేదు.. నువ్వు హైదరాబాదుకు తెస్తమన్న 20 టీఎంసీల నీళ్లు లేవు' అంటూ వివరించారు. హైటెక్ సిటీ అమ్మింద్రు అంటవు.. ఎవరన్న అమ్మింద్రా? చెప్పు. గోబెల్స్ ఉండి ఉంటే నీ అబద్ధాలను విని ఉరేసుకొనేటోడు' అని హరీశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

రుణమాఫీపై నేటికీ క్లారిటీ లేదు

'రుణమాఫీ మీద కూడా తప్పుడు ప్రచారాలు చేస్తున్నరు. రూ.7,500 కోట్లు వానకాలం రైతుబంధు ఎగ్గొట్టినవు. రూ. 2500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంటు, రూ.2000 కోట్లు ముసల్లోళ్ల పింఛన్లు ఎగ్గొట్టినవు.. రూ. 1000 కోట్ల బతుకమ్మ చీరలు ఎగ్గొట్టినవు. కేసీఆర్ కిట్ పథకాన్ని కరాబు చేసి డబ్బులివ్వకుండా ఎగ్గొట్టినవు. ఈ డబ్బులన్నీ ఎక్కడ?' అని హరీశ్ ప్రశ్నించారు. 'రుణమాఫీ చేసినప్పుడు మిత్తి మీద పడ్డదని అన్నవు.. మీ పాలనలో రైతుల మీద మిత్తి పడుతలేదా? ఆ డబ్బులు ఎవ్వరు కట్టాలె?' అని నిలదీశారు. రైతుల మీద మిత్తీల భారం పడ్డది. దీని మీద బహిరంగ చర్చకు నేను సిద్ధం. రేవంత్ నువ్వు వస్తవా? మీ భట్టి వస్తరా? తుమ్మల వస్తరా? చెప్పాలి' అని సవాల్ విసిరారు. '2 లక్షలకు పైగా రుణాలున్న వారివి ఎప్పుడు మాఫీ చేస్తవు? లేకపోతే ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణలు చెప్పండి' అని డిమాండ్‌చేశారు.

నీ అన్నదమ్ముళ్లపై ఎఫ్ఐఆర్ ఎందుకు కాలేదు?

'సంధ్య థియేటర్ ఘటనలో మహిళ మరణించడం బాధాకరమే. కొండారెడ్డిపల్లిలో నీ తమ్ముళ్ల వేధింపులతో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకుంటే ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. కేసు నమోదు చేయలేదు. వాంకిడి హాస్టల్లో ఒక గిరిజన విద్యార్థి శైలజ విషాహారం తిని చావుబతుకుల మధ్య నిమ్స్‌లో పోరాడి మరణించింది. నీకుగాని, నీ మంత్రులకు గాని పరామర్శించే తీరిక లేదా? మా ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించేందుకు వెళ్తుంటే అర్ధరాత్రి అరెస్టు చేయించడం దుర్మార్గం కాదా?' అని ఫైర్ అయ్యారు.

> 1946 డిసెంబర్ 9న సోనియాగాంధీ పుడితే.. ఆమె ప్రసన్నం కోసం తెలంగాణ తల్లి ఏర్పాటు కోసం 1946 జీవో నంబర్ ఇచ్చిండ్రు. డిసెంబర్ 9న అసెంబ్లీ పెట్టిండ్రు. ఇదంతా సోనియా ప్రసన్నానికే. నాడు సోనియాను బలిదేవత అన్నది నువ్వే, నేడు కాళ్లు పట్టుకొన్నది నువ్వే.. బయట అబద్ధాలు, లోపల అబద్ధాలతోనే సభ నడిపిండ్రు. పతివ్రత పరమాన్నం వండితే.. తెల్లారేదాకా సల్లారలేదన్నట్టున్నది రేవంత్ తీరు.
>
> -హరీశ్‌రావు

అబద్ధాల వల్లేవేతకే శాసనసభలా?

'రేవంత్‌రెడ్డి అబద్ధాలను వల్లేవేసేందుకే శాసనసభలు నిర్వహిస్తుండు. ఉత్తమ్ మాట్లాడుతూ మేం ఒక్క ఉద్యోగం ఇవ్వలేదంటాడు. ఒక్క ఇరిగేషన్ శాఖలోనే మేం 2 వేల ఉద్యోగాలిచ్చినం. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వెయ్యి కోట్లు సంపాదించిండని మరో ఎమ్మెల్యే అంటడు. నిసిగ్గుగా సభలో అబద్ధాలు మాట్లాడుతుంటే సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చినం' అని హరీశ్ చెప్పారు. ఈ రేస్ మీద చర్చ పెట్టాలని కోరితే ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవాచేశారు.

ఏడాది పాలనలో ప్రభుత్వ హత్యలెన్నో!

'మీ ఏడాది పాలనలో 54 మంది విద్యార్థులు మరణించారు. 89 మంది ఆటో డ్రైవర్లు, 29 మంది నేతన్నలు, 450 మంది రైతన్నలు ఆత్మహత్య చేసుకున్నారు. ఇవన్నీ ప్రభుత్వ హత్యలే. 1000 రేప్ కేసులు నమోదైనయి. మీ పాలనలో 390 ప్రొటెస్టులు జరిగినయ్. కుక్క కాట్లు, పాము కాట్లు, తేలు కాట్లతో ప్రజలు, విద్యార్థులు, రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నరు. ఆ తప్పిదాలను కప్పిపుచ్చుకోడానికే 2 గంటలపాటు సభలో సీఎం అబద్ధాలు మాట్లాడిండు' అని హరీశ్ ధ్వజమెత్తారు.

కోమటిరెడ్డి ఏం మాట్లాడుతున్నడో!

'సభలో మంత్రి కోమటిరెడ్డి ఏం చెప్తున్నడో ఆయనకే తెల్వదు. మంత్రి శ్రీధర్‌బాబు వెళ్లి అంగీపట్టుకొని గుంజినా, స్పీకర్ వద్దని వారించినా కోమటిరెడ్డి కూర్చోవడం లేదు. చట్టసభలపై కాంగ్రెస్ సభ్యులకు గౌరవం లేదు. బయట అబద్ధాలు, లోపల అబద్ధాలతోనే సభ నడిపిండ్రు' అని హరీశ్ అసహనం వ్యక్తంచేశారు. రేవంత్ పాలనంతా అవినీతి మయమేనని, ఈ రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు రూ.1,700 కోట్ల సర్ ప్లస్‌తో ఇచ్చామని చెప్పారు.

ప్రతిపక్షంగా సభలో మా కర్తవ్యం నిర్వహించాం

నిర్బంధాలు, అరెస్టులు రేవంత్‌రెడ్డి నిరంకుశత్వంతోనే అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యాయని, ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన తమ కర్తవ్యం నిర్వహించామని హరీశ్ చెప్పారు. 'మేం విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, ఆటో డ్రైవర్లు, ఆశాల పక్షాన మాట్లాడినం. ప్రజల పక్షాన ఆరేడు రోజులపాటు ప్రజల గొంతుకగా శాసనసభలో ఎత్తి చూపినం' అని తెలిపారు.

మొదటి రోజు – 9 డిసెంబర్, 2024:

- ఆదానీ, రేవంత్ సంబంధం.. అవినీతికి నిరసనగా వాళ్ల బొమ్మలున్న టీ షర్ట్స్ వేసుకొని మేం అసెంబ్లీకి వెళ్తే అరెస్టులు చేశారు.
- ఆదానీ– రేవంత్ చీకటి దోస్తీ గురించి చెప్పినం.
- అదానీ – రేవంత్ అవినీతిని బట్టబయలు చేసేందుకు మేం పోరాటం చేస్తుంటే, రేవంత్‌రెడ్డి గుట్టు చప్పుడు కాకుండా తెలంగాణ తల్లి మార్పు గురించి అసెంబ్లీలో చర్చ పెట్టిండు.
- తెలంగాణ తల్లి స్థానంలో కాంగ్రెస్ తల్లిని ఏర్పాటు చేసిండు.

రెండో రోజు – 16 డిసెంబర్ 2024 :

- లగచర్లలో కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్య కాండ, గిరిజన రైతులపై థర్డ్ డిగ్రీ, రైతులకు బేడీలు వేసిన ఘటనలపై నిరసన తెలియజేసినం.
- లగచర్ల ఘటనపై వాయిదా తీర్మానం ఇచ్చి చర్చకు పట్టుపడితే తిరస్కరించారు.
- మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల బిల్లులు ఎప్పుడిస్తరని నిలదీసినం.
- గ్రామాలు, పట్టణాలకు నిధులు ఇవ్వడం లేదని ప్రశ్నించినం.
- రాజీవ్ గాంధీ తెచ్చిన 73,74 రాజ్యాంగ సవరణ ప్రకారం, స్థానిక సంస్థలను బలోపేతం చేస్తమని మ్యానిఫెస్టోలో పెట్టారు తప్ప నిధులివ్వకుండా మోసం చేస్తున్నారని అడిగినం.
- మేము ఒకవైపు సర్పంచుల గురించి మాట్లాడుతుంటే మరోవైపు బయట రాష్ట్రవ్యాప్తంగా వారిని ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు.
- సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తుంటే పట్టించుకోరా అని నిలదీసినం.

మూడో రోజు — 17 డిసెంబర్ 2024 :

- లగచర్లపై చర్చకు అవకాశమివ్వకుంటే నిరసనగా నల్ల చొక్కాలు ధరించి వచ్చినం.
- బేడీలు వేసుకొని రైతుల పట్ల ఈ ప్రభుత్వం అనుసరించిన దుర్మార్గాన్ని ఎండగట్టినం.
- బీఆర్ఎస్ అప్పు 4.17 లక్షల కోట్లయితే, ఏడు లక్షల కోట్ల అప్పు అని చేస్తున్న దుష్ప్రచారాన్ని గణాంకాలతో సహా ఎండగట్టినం.

నాలుగో రోజు– 18 డిసెంబర్ 2024

- ఆటో డ్రైవర్లను ఆదుకుంటామని మాట తప్పిన కాంగ్రెస్ నైజానికి ఖాకీ షర్టులు వేసుకొని ఆటోల్లో అసెంబ్లీకి వెళ్లి నిరసన తెలిపినం.
- కాంగ్రెస్ ఏడాది పాలనలో 1913 ప్రభుత్వ పాఠశాలలు మూతపడడంపై ప్రశ్నించినం.
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో చనిపోయిన 54 మంది విద్యార్థులకు 10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేసినం.
- కేసీఆర్ పెంచిన గురుకులాల ప్రతిష్ఠ దిగజారుతున్నదని, దానిని కాపాడాలని చెప్పినం.
- ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలను వెంటనే చెల్లించాలని అడిగినం.
- పీఆర్సీని అమలు చేయాలని కోరినం.

ఐదో రోజు– 19 డిసెంబర్ 2024

- అప్పులపై తప్పుడు ప్రచారం చేస్తుంటే మళ్లీ లెక్కలతో సహా వివరించినం.
- ఓఆర్ఆర్ ఒప్పందాలపై ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ఆరోపణల నేపథ్యంలో ఒప్పందాలను రద్దు చేసుకోవాలని చెప్పినం.
- దీన్ని ముఖ్యమంత్రి సభలో వక్రీకరిస్తూ నేనే విచారణ చెయ్యాలని అడిగినట్టు మాట్లాడటం సిగ్గుచేటు.
- రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని ఎకరా 75 కోట్ల చొప్పున 30 వేల కోట్లకు ప్రభుత్వం అమ్ముతున్న విషయాన్ని సభలో బయటపెట్టినం.

ఆరో రోజు –20 డిసెంబర్ 2024

- కేటీఆర్ తెలంగాణ ప్రతిష్ఠను పెంచేందుకు హైదరాబాద్‌లో ఫార్ములా ఈ-కార్ రేస్ నిర్వహిస్తే దాన్ని కూడా వాళ్లు తప్పుబట్టారు.
- అవినీతి జరగకముందే జరిగిందని అక్రమంగా ఏసీబీ కేసు బనాయించారు.
- దీనిపై చర్చకు వాయిదా ప్రతిపాదన ఇస్తే తిరస్కరించారు.

ఏడో రోజు – 21 డిసెంబర్ 2024

- రైతు భరోసాపై చర్చ సందర్భంగా అవాస్తవాలు ప్రచారం చేయాలని చూస్తే.. కేటీఆర్ కుండబద్దలు కొట్టినట్టు వాస్తవ లెక్కలు వివరించారు.
- పంటలు పండే భూములకే రైతు భరోసా అంటూ కోతలు విధించే ప్రయత్నం చేస్తున్నారన్న విషయాన్ని బట్టబయలు చేసిండు.
- రైతు భరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను అసెంబ్లీ సాక్షిగా బయట పెట్టిండు.
- మంత్రి వర్గ ఉప సంఘం నివేదికను వెంటనే బయట పెట్టాలని ప్రశ్నించిండు.

రైతులను అడుగుదామా : హరీశ్

మిషన్ భగీరథలో 50 వేల కోట్లు తినేశారని సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన ఆరోపణలను హరీశ్ సమర్థవంతంగా తిప్పికొట్టారు. మిషన్ భగీరథ పథకానికి అయిన ఖర్చే 28 వేల కోట్లయితే 50 వేల కోట్లు తినేశారని ఎలా ఆరోపిస్తారని ప్రశ్నించారు. ఇలా మాట్లాడటం సబబుకాదని, కోమటిరెడ్డి ఆరోపణలను సభ రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను కోరారు. బీఆర్ఎస్ పాలనలో నల్లగొండ జిల్లా అన్యాయమైపోయిందన్న వెంకటరెడ్డి ఆరోపణలను తిప్పికొట్టారు. 'అసెంబ్లీ నుంచి నీదా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడకు పోదాం. నాడు కాంగ్రెస్ పాలనలో ఒక్క ఎకరానికీ నీళ్లు రాకపోతే కాళేశ్వరంతో రెండు లక్షల ఎకరాలకు గోదావరి నీళ్లిచ్చినం. ఈ నీళ్లు కేసీఆర్ వచ్చినంక వచ్చినయా? అంతకు ముందే వచ్చినయా? అని కాల్వల మీద రైతులను అడుగుదాం' అంటూ సవాల్ విసిరారు. 'నల్లగొండ జిల్లాకు మూడు మెడికల్ కాలేజీలు ఇచ్చినం. యాదాద్రి పవర్‌ప్లాంట్ తెచ్చినం. గత ఐదేండ్లల్లో నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధి చేసినం. సమగ్రంగా అభివృద్ధి చేసినం' అంటూ దీటుగా తిప్పికొట్టారు.

సభ ఆలస్యంపై హరీశ్ అసంతృప్తి

శాసనసభ ఆలస్యంగా ప్రారంభం కావడంపై హరీశ్ అసంతృప్తి వ్యక్తంచేశారు. సభ ప్రారంభం కాగానే పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. సభ రోజూ 5,10 నిమిషాలు ఆలస్యమవుతున్నదని, సమయపాలన పాటించి అందరికీ ఆదర్శంగా సభ ఉండేలా చూడాలని కోరారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్పందిస్తూ జీరో అవర్ కొనసాగించే అంశం, సభ్యులకు అవకాశం కల్పించే విషయంలో చర్చించడంతో సభ ఆలస్యమైందని చెప్పారు.

సీఎల్పీ సమావేశాలా? శాసనసభా?

'15 రోజులైనా సభ నిర్వహించాలని మేం పట్టుబడితే.. నిర్వహించకపోగా వారానికే సరిపెట్టారు. అప్పుల విషయంలో ప్రభుత్వం సెల్ఫ్‌గోల్ చేసుకున్నది. గాంధీభవన్, సీఎల్పీ సమావేశాల లాగా శాసనసభను నడిపారు' అని హరీశ్ దుయ్యబట్టారు. సభలో ఎమ్మెల్యేల సంఖ్యకంటే మార్షల్స్ సంఖ్య పెరిగిందని, ఎమ్మెల్యేలు 119 మంది ఉంటే మార్షల్స్ 150 మంది వరకు ఉన్నారని ఎద్దేవాచేశారు. నగర బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, హైడ్రా మీద ప్రభుత్వాన్ని ప్రశ్నించడంతోనే వాళ్లు వెనకడుగు వేశారని చెప్పారు. కూల్చివేతలపై ప్రభుత్వం వెనకడుగు వేసిందంటే అది బీఆర్ఎస్ పోరాట ఫలితమేనని స్పష్టంచేశారు. సమావేశంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, మాణిక్‌రావు, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, చింతా ప్రభాకర్ పాల్గొన్నారు.

మండలి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న మధుసూదనాచారి చిత్రంలో ఎమ్మెల్సీలు కోటిరెడ్డి, మహమూద్ అలీ, రవీందర్‌రావు, సుభాష్‌రెడ్డి, తాతామధు, సత్యవతిరాథోడ్

ప్రజా సమస్యలపై చర్చించని ప్రభుత్వం

- అధికార పార్టీ ఎజెండాకే పరిమితమైన సమావేశాలు
- ఎమ్మెల్సీ మధుసూదనాచారి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ): ప్రజల సమస్యలపై శాసనమండలిలో రాష్ట్రప్రభుత్వం ఏమాత్రం చర్చించలేదని ప్రతిపక్షనేత మధుసూదనాచారి విమర్శించారు. మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మాట్లాడుతూ శాసనమండలి సమావేశాలు అధికార పార్టీ ఎజెండాకే పరిమితం అయినట్టు తెలిపారు. అత్యంత ప్రాముఖ్యమైన రైతుభరోసాపై సభలో చర్చ పెట్టకుండా దాటవేశారని విమర్శించారు. ఎన్నికల హామీల్లో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ నిలువునా ముంచిందని మండిపడ్డారు. రైతు ల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలోనే ఎండగడతామని వెల్లడించారు.

శాసనమండలిలో గళ మెత్తిన ఎమ్మెల్సీలు

జీరో అవర్‌లో సమస్యలను లేవనెత్తిన అధికార, ప్రతిపక్ష సభ్యులు

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : శాసనమండలిలో అధికార, ప్రతిపక్ష ఎమ్మెల్సీలు స్పెషల్ మెన్షన్ కింద పలుసమస్యలపై తమ గళం వినిపించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగు బెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ..1000కి పైగా గురుకులాలు, 495 కేజీబీవీలు, 194 ఆదర్శ పాఠశాల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడంలో ఎదురవుతున్న సమస్యలను రాజకీయం చేయడం తగదన్నారు. ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ హామీతో కేంద్రం ఉత్తర్వుల అమలుతో కొంతమంది ఉద్యోగులకైనా మేలు చేయాలని, తద్వారా రూ.200 కోట్ల మేర నిధులు రాష్ట్రానికి అందుతాయన్నారు. చింతపండు నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. నిమ్స్ దవాఖానలో 65 శాతం ఆంధ్రా ఉద్యోగులు అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని, తెలంగాణ నిరుద్యోగులకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. టీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. హోంగార్డుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని, ఎక్కడివారికి అక్కడే డ్యూటీలు ఇవ్వాలని, కారుణ్య నియామకాల్లో వారికి స్థానమివ్వాలని కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ టీ రవీందర్‌రావు మాట్లాడుతూ.. స్పెషల్ మెన్షన్‌లో లేవనెత్తిన సమస్యలపై ప్రభుత్వం నుంచి స్పందన లేదంటూ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎల్ రమణ మాట్లాడుతూ.. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఇసుక మాఫియాపై చర్యలు లీసుకోవాలని కోరారు. కోదండరాం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో బలిదానమైన వారి కుటుంబాలకు రూ.20 వేల పింఛన్, ఇండ్ల స్థలం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బస్వారాజు సారయ్య మాట్లాడుతూ.. రజకుల కరెంటు బిల్లుల సమస్య పరిష్కరించాలని కోరారు. శేరి సుభాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. వనదుర్గ ప్రాజెక్ట్ ఆయకట్టుకు సాగునీటి విడుదలపై ప్రభుత్వం ప్రకటన చేయాలన్నారు. ఎంఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ.. టూరిజం పాలసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. బీ మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన కవులు, కళాకారుల ఉద్యోగ, ఉపాధి కల్పనపై చర్యలు తీసుకోవాలని కోరారు. బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. ప్రీలాంచ్ ఆఫర్లతో అక్రమ వెంచర్ల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎగ్గె మల్లేశం మాట్లాడుతూ.. గొర్రెల స్కామ్ విచారణతో డీడీలు కట్టిన వారికి అన్యాయం జరుగుతుందని, వారికి న్యాయం చేయాలని కోరారు. మంకెన కోటిరెడ్డి మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ క్వార్టర్స్ రిజిస్ట్రేషన్ల వివాదం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు అనుమతులివ్వాలన్నారు. మహ్మద్ అలీ మాట్లాడుతూ.. మైనార్టీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

లోకం పోకడ

అందుకేగా ఉచితాలను ఎగ్గొడుతున్నారు!

పంచాయతీల విలీనంపై ప్రజల్లో అనుమానాలు

- మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : నగర శివారులోని మున్సిపాలిటీల్లో కొత్తగా విలీనమయ్యే గ్రామాల ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు తొలగించి, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి ప్రణాళికలు రూపొందిస్తుందో స్పష్టంచేయాలని మండలిలో విపక్ష నేత మధుసూదనాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల విలీనంతో ప్రజల ఉపాధి దెబ్బతినడంతో పాటు ప్రజలపై పన్నుల భారం పెరుగుతుందని, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం పెరుగుతుందనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, వీటిపై ప్రజలకు భరోసా కల్పించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పంచాయతీరాజ్ సవరణ బిల్లులో ఎన్నికల హామీ అయిన స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు.

చెరువుల అన్యాక్రాంతంపై విచారణ చేపట్టాలి

- మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హైదరాబాద్, డిసెంబర్ 21 (నమస్తేతెలంగాణ) : రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, కుంటల అన్యాక్రాంతంపై సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ పేర్కొన్నారు. మండలిలో బిల్లులపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల అరికట్టేందుకు హైడ్రా ఏర్పాటును సమర్థిస్తున్నట్టు చెప్పారు. ఆక్రమణలు తొలగించినప్పుడు గతంలో పేదలకు ఇచ్చిన పట్టాల్లో నిర్మించుకున్న ఇండ్లను కూల్చవద్దని సూచించారు. నగర శివారులోని మున్సిపాలిటీల్లో గ్రామపంచాయతీల విలీనంతో అక్కడ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగ